# ఈ రేయి గడిస్తే చాలు

అడుసుమిల్లి మల్లికార్జున

"అక్కా! కథ చెప్పవూ?" అఖిల గుండెలమీద చెయ్యి వేసి కుదుపుతూ అడిగింది — ఆమె చిన్నారి చెల్లెలు కళ్యాణి.

అఖిల అటు తిరిగి పడుకుంది

భుజం పట్టుకు లాగుతూ 'చెప్పవూ' ముద్దుగా మళ్ళీ అడిగింది

అఖిల మౌనంగా వుండి పోయింది

కాసేపు చూసి అక్క పక్కలో వొదిగి పండుకుంది కళ్యాణి.

చంద్రుడు లేని ఆకాశం వొంక చూస్తూ 'ఎప్పుడు తెల్లవారుతుందో' అనుకుంది అఖిల ఆ ప్రశ్న అప్పటికే ఎన్నోసార్లు అనుకుంది తను



అనుకునే కొద్దీ కాలం మరింత భారంగా గడుస్తున్నట్టుంది.

కొన్ని నిర్ణయాలు తీసుకునేప్పుడు మనం ఆలస్యం చేస్తే — తర్వాత కాలమే నిర్ణయిస్తుంది. అప్పుడు మన ప్రమేయం లేశమైనా వుండదు.

అఖిల విషయంలో కూడా సరిగ్గా అట్లాగే జరిగిందని చెప్పవచ్చు. లేకుంటే అఖిల ఆ నిర్ణయానికి అంత తొందరగా వచ్చి వుండేది కాదేమో!

లేకుంటే శేఖర్ ఎవరు ?

తనెవరు ?

తన తమ్ముడికి పెళ్ళిచూపులేవిటి ?

ఒక దానితో ఒకటి ఏ మాత్రం పొంతన లేక పోయినా — ఆఖరికి తన తమ్ముడి పెళ్ళిచూపులే తన జీవితగమ్యానికి మార్గం చూపించినట్టైంది.

లేకుంటే తను — శేఖర్ ... తలచుకుంటేనే ఆశ్చర్యంగా వుంది. కానీ రేపటితో తను అమ్మని, చెల్లిని ... అందర్నీ వొదిలి వెళ్ళిపోతుంది.

ఆ ఆలోచన రాగానే అఖిల కళ్ళు చెమ్మగిల్లాయి.

బొట్టులేని తన నుదుటి భాగంలా వున్న చంద్రుడులేని ఆకాశాన్ని చూస్తూ వుండిపోయింది అఖిల.

అక్కడక్కడా ఒక నక్షత్రం మెరుపులా మెరిసి పోతోంది.

* * *

పెళ్ళై ఏడాది కాకముసుపే భర్తను పోగొట్టుకుని పుట్టింటికి వొచ్చింది అఖిల. అఖిల వాళ్ళ నాన్నగారు ఏరికోరి మంచి సంబంధమే చూసి పెళ్ళిచేశారు

కానీ అనుకోని విధంగా కారు యాక్సిడెంట్‌లో అఖిల భర్త చనిపోయాడు. వూహించని పరిణామం. ఎవ్వరమైనా చేసేదేముంది ?

అఖిల మాత్రం ఏం చేస్తుంది ?

తంతు అంతా జరిగాక పుట్టింటికి చేరిన ఏడాదివరకు అఖిల నిర్వికారంగా వుండిపోయింది. వేళకి భోజనంలేదు నిద్రలేదు. ఆరోగ్యం పూర్తిగా దెబ్బతింది

అఖిలను దక్కించుకోవడం గగనమైపోయింది వాళ్ళ తలిదండ్రులకు చిన్నగా కోలుకున్న అఖిల యాంత్రికంగా జీవిస్తూ వచ్చింది.

పొద్దున్నే లేచి దేవుడి పటాల వద్ద కూచొని ఎప్పుడో లేచేది ఏదో అంత తిని చెల్లెలికి తలదువ్వి బడికి పంపించేది మళ్ళీ దేవుడి మందిరంలోకి వెళ్ళి పోయేది మధ్యాన్నం అక్కడే నిద్రపొయ్యేది

మళ్ళీ బడినుంచి తన చెల్లెలు వొస్తేనే కాసేపు దానితో పొద్దుపుచ్చేది

అట్లా నిర్వికారంగా, నిర్లిప్తతతో జీవితం గడిపే అఖిల జీవితంలోకి శేఖర్ ప్రవేశించేడు

అది కూడా చాలా చిత్రంగానే జరిగింది.

శేఖర్‌వాళ్ళది యెదురు ఇల్లు. తన అమ్మవాళ్ళు అఖిల దౌర్భాగ్యాన్ని, మంచితనాన్ని కలబోసి కథలు కథలుగా చెప్పుకోటం విన్న శేఖర్ మనసులో తనకు తెలీకుండానే అఖిలమీద జాలి కలిగింది. అది క్రమేపీ ఆరాధనగా మారింది

ప్రతిరోజూ శేఖర్ వాకిట నిలబడి చూసేవాడు అఖిల యెప్పుడూ అతనికి కనిపించేది కాదు. పొరపాటున ఎప్పుడైనా చూస్తే ఆమె తల వంచుకొనో, చీరనో చూడగలిగేవాడు అంతేగాని అఖిలను పూర్తిగా చూసింది లేదు

కానీ కుతూహలం కొద్దీ శేఖర్ ప్రతిరోజూ ఆమెను చూడటానిగ్గాను యెదురు చూసేవాడు.

అనుకోకుండా ఒకసారి అతనికి అదృష్టం కలిసి వొచ్చింది. ప్రతిరోజూ అఖిల పువ్వులు కోసేది దేవుడికి. వాళ్ళింట్లో వున్న నందివర్ధనం చెట్టు కిందకి వుండటంవలన — రోజూ పువ్వులు కోస్తున్నా బయటవాళ్ళెవ్వరికీ తను కనిపించేది కాదు.

ఆ రోజు పువ్వులు చెట్టు పై కొమ్మలకి వున్నాయి. చిన్న స్టూలు తెచ్చుకుని దానిమీద నిలబడి పూలు కోస్తూవుంది. అప్పుడు చూసేడు శేఖర్ — ఆకుపచ్చటి ఆకుల మధ్య పచ్చగా తళతళా మెరిసి పోతున్న అఖిలను.

అఖిల మామూలుగా అందగత్తె. దానికితోడు ముఖంలో ప్రశాంతత.

పెళ్ళికాని ఎవ్వరో కన్నెపిల్ల అనుకున్నాడు శేఖర్. కానీ శూన్యమైన నుదుటి భాగం చూసేక 'ఈమేనా ?' అనిపించింది.

ఆ అందం —

ఆ ప్రశాంతత — చూసేక నమస్కరించా లనిపించింది శేఖర్‌కి. ఆశ్చర్యంతో అట్లాగే చూస్తూ వుండిపొయ్యాడు.

అందిన పువ్వులన్నీ కోసేక మామూలుగా అటు చూసింది.

శేఖర్‌ని చూసి ఒక్క క్షణం — మళ్ళీ చూసి — దిగిపోయింది.

అఖిలకీ ఆశ్చర్యమేసింది.

ఎవరతను ?

అట్లా చూస్తున్నాడు ?

ఎప్పుడో బాగా పరిచయమైన వ్యక్తిని మళ్ళీ చాలా కాలం తర్వాత అనుకోకుండా చూస్తే — ఎట్లా చూస్తారో — అట్లాంటి చూపు అది.

నిజమే! శేఖర్ అఖిల వొంక చూస్తున్నంత సేపూ — గొప్ప తేజస్సుతో వెలిగిపోతూ కనిపించేడు.

అదంతా అతని ఆశ్చర్యమే.

అఖిల అట్లా అనుకోలేదు.

మళ్ళీ ఒకసారి అదే స్థితిలో అతన్ని చూసింది. అంతవరకు ఆ సంగతి మరచిపోయిన అఖిల మొదటి సారిగా అతన్ని గురించి ఆలోచించసాగింది

ఏ అభిప్రాయమూ మనసులో చోటుచేసుకోక ముందే—రోజూ అతన్ని చూడటం అలవాటుగా మారి పోయింది. కాలం గడిచేకొద్దీ—ఒకరిని చూసి ఒకరు చిన్నగా నవ్వుకునే స్థితికి వొచ్చారు

అఖిలకు మనసులో భయం. కానీ ఎవ్వరూ ఏమాత్రం వూహించని విధానం అది కంటిసైగలో, లేతనవ్వులో పలకరించుకోటం. అందుకే అదోలాంటి ధైర్యం

ప్రశాంతంగా వున్న అఖిల మానస సరోవరంలో శేఖర్ చిన్న అలజడి రేపాడు ఆమె దైనందిన జీవితంలో చిన్నమార్పులు వొచ్చాయి ఎప్పుడూలేనిది కాసింత హుషారుగా కనిపించసాగింది. ఆ పరిణామం ఆమె తల్లిదండ్రులకు కొంత సంతృప్తిని కలిగించిందనే చెప్పాలి.

చిన్నతనంనుంచి అఖిలది చాలా సున్నితమైన మనస్తత్వం. అందరి గారాబం ఆమెకు సంపూర్తిగా లభించేది. ఆమె భర్త చనిపోయాడని తెలిశాక- అఖిల యెంత దుఃఖించిందో వాళ్ళ అమ్మా, నాన్న గారు కూడా అంతకంటే యెక్కువ క్లేశాన్ని అనుభవించారు.

పుట్టింటికి వొచ్చింది మొదలు కళ్ళలో దీపాలు పెట్టుకుని ఆమెను గమనించారు — ఏదైనా అఘాయిత్యానికి పాలుపడుతుందేమోనని ఆ యేడాది కాలంలో ఆమెను దక్కించుకోడానికి ఎంత ప్రయాస పడ్డారో చెప్పలేం. అందుకే అఖిలలో వొస్తున్న మార్పు వాళ్ళనెంతో తృప్తిపరచింది.

కారణం తెలిస్తే ఏట్లావుండేదో! ఏమో! కానీ, ప్రస్తుతం మాత్రం గడచిపోయిన విషాద సంఘటనను తాత్కాలికంగా మరిచిపోయి ఇంటిల్లిపాది అంతో యింతో సతోషంగా వున్నారు.

కుటుంబ పరిస్థితి తృప్తికరంగా వుందని భావించిన అఖిల తండ్రి పరంధామయ్యగారు వాసుకి సంబంధాలు చూడసాగారు

పరంధామయ్యగారికి అఖిల తర్వాత మగసంతానం వాసు. వాసు తర్వాత చిన్నపాప కళ్యాణి అఖిలకు వాసుకి ఒక్క యేడాది తేడా. తర్వాత చాలా కాలానికి కళ్యాణి పుట్టింది

వాసుకి బ్యాంక్‌లో ఉద్యోగం కుర్రాడు పచ్చగా, ముద్దుగా వుంటాడు. చాలా సంబంధాలు వొచ్చాయి గానీ అప్పుడే పెళ్ళిచెయ్యటం ఇష్టంలేక పరంధామయ్య గారే తిప్పిపంపారు.

ఇంతలో అఖిల జీవితం అట్లా అయింది. ఏ క్షణానికి ఏమి జరుగుతుందో ఎవ్వరు చెప్పగలరు — అనే భావం మనసులో పడింది. అందుకే ఆలస్యం చెయ్యకండా వాసుకి సంబంధాలు వెతకసాగాడు

ఒక సంబంధం అన్నివిధాలా నచ్చింది అమ్మాయి కడు యోగ్యురాలు మంచి సాంప్రదాయం. అన్నీ కుదుర్చుకుని వొచ్చాడు

ఓ సుముహూర్తాన నెల్లూరు నుంచి పెళ్ళి వారు దిగారు— పెళ్ళి చూపులకి. వాళ్ళూ అన్ని విషయాలలో సుముఖత చూపించారు కానీ ఇంట్లో విధవ ఆడపడచు వుందన్న ఒకే ఒక్క కారణాన పెళ్ళి వుత్తరం రాస్తామని చక్కాపొయ్యారు ఉత్తరం వ్రాయలేదు.

'ఆ సంబంధం తప్పిపోవటమే మంచిది' అని అన్నది అఖిల తల్లి సుభద్రమ్మ 'ఇంకా నయం అమ్మా, నాన్న కూడా వున్నారని అనలేదు ఏం ? విధవ ఆడపడచు వీళ్ళనేం చేసిందట దాని ఖర్మకాలి యిట్లా అయిందిగాని లేకుంటే వీళ్ళకంటే మారాజులా వుండేది అసలు ఆ బోడి సంబంధం మాకే నచ్చ లేదని ఘాటుగా ఒక వుత్తరం ముక్క రాసి పడెయ్యండి' అంది.

పరంధామయ్యగారు మౌనంగా వుండిపొయ్యారు అఖిల అంటే ఆయనకు ప్రాణం. మళ్ళీ ఒకసారి అఖిల జీవితము, భవిష్యత్తు గుర్తు వొచ్చి ఆయన మనసు వికలమైపోయింది

అఖిలకు ఆ విషయం తెలీకండా వుండటానికి శతవిధాల ప్రయత్నించేరు కానీ అఖిలకు తెలిసి పోయింది.

నిజమే. తనేం చేసింది? తనేం చేస్తుంది? భర్త లేక వేరు దిక్కులేక పుట్టింటికి చేరిన అభాగ్యురాలు.

తన దురదృష్టం ఇక్కడ కూడా వ్యాపించింది. తన మంచితనం, మెతకతనం వాళ్ళకెట్లా తెలుస్తుంది ? యే తల్లిదండ్రులైనా బిడ్డల సౌఖ్యమే చూస్తారు కదా ! వాళ్ళు, భార్యాభర్తలు పచ్చగా వుంటే తను ఓర్వలేదనా వాళ్ళ అభిప్రాయం.

ఎంత దారుణం ? తన జీవితమే కాదు. తను వుండి వీళ్ళందరి జీవితాలకి కూడా శాంతి లేకుండా చేస్తుంది. చచ్చిపోదామంటే భయం.

ఆ రాత్రంతా అఖిల నిద్రపోలేదు. తడిసిన కళ్ళతో అట్లాగే వుండిపోయింది. మళ్ళీ అఖిల పరిస్థితి పూర్వంలా తయారైంది. శేఖర్ విషయం కూడా పూర్తిగా మరిచిపోయింది.

ఒకరోజు సాయంకాలం ఇంట్లో ఎవ్వరూలేరు. అఖిల వొక్కతే ఇంటిలోపల యెక్కడో వుంది. ఎవరో పిలిచినట్టై వెలుపలికి వచ్చింది.

ఎదురుగా శేఖర్.

ఏం చెయ్యాలో చప్పున తోచలేదు అఖిలకి. తడబడుతూ 'కూచోండి' అంది.

శేఖర్ కూచోలేదు.

'క్షమించండి . ' అంటూ ఒక తెల్లకాగితం కుర్చీలోపెట్టి మౌనంగా వెళ్ళిపోయాడు.

బిత్తరపోయింది అఖిల. యెంత చొరవ ? ఏమనుకుంటున్నాడు తను? యెంత ధైర్యం ?! అసలు తప్పు అంతా తనది. కోపంతో ఆమె ముఖం ఎర్రనైంది.

ఉత్తరం తీసుకుని చింపబోయింది. మరు క్షణమే అభిప్రాయం మార్చుకుని వొణికే చేతులతో తలుపు గడియవేసి మంచంమీద కూచొని ఉత్తరం చదవసాగింది.

ఉత్తరం సాంతం చదివాక అఖిల మనసు కుదుటపడింది. అది ప్రేమలేఖ కాదు. చాలా మామూలుగా, సభ్యతగా తన అభిప్రాయాన్ని సూటిగా వ్రాశాడు. తనకి అభ్యంతరం లేకుంటే వివాహం చేసుకుంటానన్నాడు. ఇది ఏ మాత్రం జాలి కాదని, చాలాకాలం ఆలోచించి ఈ నిర్ణయానికి వొచ్చానని వ్రాశాడు. తన అభిప్రాయం తప్పుగా తోస్తే క్షమించమని, మరెప్పుడూ జీవితంలో తన వైపు కన్నెత్తికూడా చూడనని ముగించాడు.

అట్లాగే మంచంమీద పడుకుని ఆలోచించ సాగింది అఖిల. ఎవరు అతను? అకారణంగా తనపై అమృతజల్లులు కురిపిస్తున్నాడు. అంత త్వరగా అంగీకరించలేదు అట్లా అని దూరంగా నెట్టివెయ్య లేదు. ఏం చెయ్యాలి ? ఎంత ఆలోచించినా చివరకు ప్రశ్న ప్రశ్నగానే మిగిలిపోయింది.

తను కోరకుండానే తనకంటూ ఒక వ్యక్తి వున్నాడని నమ్మకంగా తెలిశాక ఆమెకు కొంత ధైర్యం కలగసాగింది. ప్రస్తుతానికి స్థిరంగా ఏ అభిప్రాయానికీ రాకుండానే ఆలోచనలను ఆపుచేసింది.

కొద్ది రోజులు మామూలుగా గడిచిపోయాయి.

ఆ రోజు — అఖిల దొడ్లో మంచమ్మీద పడుకుని వుంది. ఇంట్లో నుంచి అమ్మా నాన్న మాటలు వినిపించసాగాయి.

'ఈ సంబంధమైనా కుదిరితే బావుణ్ణు' అది తల్లి గొంతు.

## ఈ రేయి గడిస్తే చాలు

'నిజమే. చాలా మంచి సంబంధం. ఒక్కతే అమ్మాయి. తప్పకుండా కుదిరితీరుతుంది' పరంధామయ్యగారు అంటున్నారు.

నాన్నగారు వాసుకి ఏదో సంబంధం చూసి నట్టుంది — అనుకుంది అఖిల.

'మనం అనుకుంటే సరిపోతుందా ? వాళ్ళకు అన్నీ నచ్చావద్దూ. ముందు సంబంధం మాత్రం కుదురుతుందని అనుకోలేదూ మనం.'

'నోర్మూయ్. అమ్మాయి ఇంకా నిద్రపోయినట్టు లేదు.'

'ఇప్పుడేమన్నాను నేను. నాకు మాత్రం అది అంటే ప్రేమ లేదూ. ఏదో దాని ఖర్మ కాలి.. '

'ఛీ...ఛీ ..' పరంధామయ్యగారు భోజనం మధ్యలో లేచి వెళ్ళిపోయ్యారు.

అంతా వింటున్న అఖిల మౌనంగా రోదిస్తూ దిండులో తల దాచుకుంది.

''భగవంతుడా ! నన్నెందుకు పుట్టించావు ? లోకంలో యెందరెందరో అకారణంగా చనిపోతున్నారే. దేనికీ పనికిరాని నేను వ్యర్థంగా ఎందుకు బ్రతుకుతున్నట్టు ? నాలాంటి నిర్భాగ్యులకి చావు నెందుకు ప్రసాదించవు ?''

ఇంతలో అడుగుల చప్పుడు విని గట్టిగా కళ్ళు మూసుకుంది అఖిల.

పరంధామయ్యగారు వొచ్చి కూతురు నిద్ర పోతుందని అనుకొని ఆమె తలపై ఆప్యాయంగా చెయ్యివేసి నిమిరి, ఒక నిట్టూర్పు విడిచి వెళ్ళి పోయారు.

ఆ రాత్రంతా అఖిల తన భవిష్యత్తును గురించి ఆలోచిస్తూ నిద్రపోలేదు. ఏం చెయ్యాలి తను ? ముసలిదై చచ్చిపోయేదాకా ఇట్లా పుట్టింటిలోనే ఒంటరిగా బ్రతుకుతూ వుండిపోవలసిందేనా ?

ఆ ఆలోచనతో ఆమె గుండె దడదడలాడింది.

అమ్మో ! ఇంకేమైనా వుందా ? తనువుంటేనే వాసు పెళ్ళికి అడ్డుగా వుందే ! ఇహ వెళ్ళిపోతే — తల్లిదండ్రుల పరిస్థితి, కుటుంబ మర్యాదా ? కళ్యాణి భవిష్యత్తు...అంతా గందరగోళంగా ఆమెకు కన్పించ సాగింది.

### సంకేతాలు

ఒక రచన చదివాక
మరింకేం చదవకుండా
కళ్ళు మూసకొని కాస్తంత
యోచనలో పడిపోగలిగితే
అంతకన్నా మంచి సాహిత్యం
మరొకటి లేదు.

ఒక సంగీతం విన్నాక
మరింకేం వినకుండా
రేడియో కట్టేసి కాస్తంత
నిశ్శబ్ద తరంగాల్ని వరించగల్గితే
అంతకన్నా మంచి సంగీతం
మరొకటి వుండబోదు.

- మరాశర్మ

అఖిల కన్నీళ్ళతో ఆ రాత్రి సాగిపోయింది

తెల్లవారింది. యాంత్రికంగా పనులుచేస్తూ, రాత్రి తెగని ఆలోచనలమధ్యనే కొట్టుమిట్టాడుతూ వుంది అఖిల.

అన్నివిధాలా ఆలోచించి ఆఖరకు ఒకనిర్ణయానికి వొచ్చింది. రేపు వాసుని చూట్టానికి పెళ్ళివా రొస్తారు. ఈ సంబంధం కూడా తనమూలంగానే ఆగిపోతే — శేఖర్‌తో కలిసి పోవటం అట్లాగాక ఈ పెళ్ళికుదిరితే భవిష్యత్తును కాలానికి వొదిలేసి శేఖర్‌ని మరచిపోవటం. చాలా ధైర్యం తెచ్చుకుని స్థిరంగా ఆ నిర్ణయానికి వొచ్చింది అఖిల

నిజమే తనమూలంగా ఈ సంబంధమూ తప్పిపోతే—ఎంత ప్రేమాభిమానాలున్న తల్లిదండ్రుల కైనా రవంతైనా బాధ కలగకపోతుందా అది చూసి తను బ్రతుకగలదా ? అందుకే అట్లా జరిగితే తను తన భవిష్యత్తు చూసుకోటం ఉత్తమం.

ఈ నాగరికతా ప్రపంచంలో వున్నవాళ్ళే — ఇంట్లో విధవ ఆడపడచు ఉందన్న వాళ్ళే — రేపు లేచిపోతే ఏమీ అనకుండావుంటారా ? వుండరు. మూఢాచారాలు. వికృతమైన మనస్తత్వాలు, ఈ సమాజం వున్నంతవరకు వుంటూనే వుంటాయి.

వీటిని ఎవరూ మార్చలేరు ధైర్యంచేసి తెగించటమే పరిష్కారం అట్లాగాక భగవంతుని దయవల్ల ఈ మంచి సంబంధం కుదిరితే — అంతే చాలు. తన జీవితం ఇట్లాగే గడిచిపోతుంది

ఎందుకనో ఈ సంబంధమూ తప్పిపోతుందనీ, తన జీవితం శేఖర్‌తో ముడిపడుతుందనీ అఖిల మనసులో గట్టి నమ్మకం. ఏది ఏమైనా తన భవిష్యత్తు రాబోయే పెళ్ళివారి చేతిలోపెట్టి తన ప్రమేయం ఏమీ లేనట్టు రేపటి కోసం ఎదురు చూస్తూవుంది అఖిల.

ఈ రాత్రి గడిచిపోతే తన జీవిత నిర్ణయం తెలిసిపోతుంది. పక్కలో వొదిగి పడుకునివున్న కళ్యాణి వంక ఆప్యాయంగా చూసి నుదుటిమీద ముద్దు పెట్టుకుంది.

చప్పున అఖిల కళ్ళలో నీళ్ళు తిరిగాయి ఇంక ఎవరు దానికి కథలు చెప్తారు ? రేపు ఒకవేళ తను వూహించిన విధంగానే జరిగితే — అమ్మా, నాన్న ఏమనుకుంటారు ? వాసు అసహ్యించుకోడూ ?

ఏమో ! ఏమి జరుగుతుందో. ఈ రాత్రి గడిస్తే కదా ! శేఖర్‌లాంటి మంచి వ్యక్తి తోడులో తను జీవితాంతం హాయిగా కాలం గడపగలదు. తనకా నమ్మకం వుంది. కానీ మళ్ళీ ఇంటి గడప తొక్కగలదా ? ఎల్లకాలమూ వాళ్ళ కోప తాపాలు అట్లాగే వుంటాయా ?

ఎన్ని ఆలోచనలు మనసును కమ్ముకున్నా, నిర్ణయించుకున్న అభిప్రాయం మాత్రం మార్చుకో దలుచుకోలేదు.

మళ్ళీ ఒకసారి కళ్యాణిని ముద్దు పెట్టుకుంది.

కంటి కొనకుల్లో నిలిచిన కన్నీటితో అట్లాగే ఆలోచిస్తూ వుంది అఖిల.

ఎక్కడో కోడి కూసినట్టైంది.

ఉలిక్కిపడింది అఖిల.

శూన్యమైన ఆకాశం వంక చూస్తోంది.

ఎక్కడో ఒక్క నక్షత్రం మెరుపులా మెరిసింది ★